గోరుముద్ద.. మరింత పటిష్టం

- పెరిగిన మధ్యాహ్న భోజన పథకం మెనూ ధరలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు
- వారానికోసారి రంగుతో కూడిన కోడిగుడ్లు సరఫరా
- మెనూ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ



ఎర్రగుంట్లలో విద్యార్థులకు వడ్డిస్తున్న వంటఏజెన్సీలు, పర్యవేక్షణ చేస్తున్న ఉపాధ్యాయుడు

ఎర్రగుంట్ల : ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జగనన్న గోరుముద్ద పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. పౌష్టికాహారం అందితేనే పిల్లలు ఆరోగ్యంగా ఉండి చదువులో కూడా రాణిస్తారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకో రకమైన మెనూను అమలు చేస్తున్నారు. గతంతో ఎన్నడూలేని విధంగా వారంలో 5 రోజులు గుడ్డు, 3 రోజులు చిక్కీలను అందజేస్తున్నారు. జగనన్న గోరుముద్ద మరింత నాణ్యతగా రుచికరంగా అందజేయాలని గత నెల నుంచి మెనూ ధరలను పెంచారు. అలాగే పర్యవేక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, మైలవరం, పెద్దముడియం మండలాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు.

రోజుకో మెనూతో...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెనూలో పూర్తి మార్పులు తెచ్చింది. రోజూ రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ప్రతి సోమవారం అన్నం, పప్పు చారు, ఎగ్‌కర్రీ, చిక్కీ, మంగళవారం పులిహోర, టమోటా పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, బుధవారం వెజిటేబుల్ బిరియాని, అలుకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, గురువారం కిచిడీ, టమోటా చట్నీ, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, శనివారం అన్నం, సాంబార్, స్వీటు పొంగల్, అందజేస్తున్నారు. ఇప్పటివరకు నెలకు మూడు సార్లు మాత్రమే పాఠశాలలకు కోడి గుడ్లు సరఫరా చేయగా ఈనెల ఒకటో తేదీ నుంచి నెలకు నాలుగు సార్లు సరఫరా, చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి వారం రంగులతో కూడిన స్టాంపులను గుడ్ల మీద ముద్రించి అందజేస్తున్నారు. మొదటి వారం బ్లూ, రెండోవారం పింక్, మూడో వారం గ్రీన్, నాలుగో వారం పర్పుల్ రంగుల స్టాంపులతో కూడిన గుడ్లను పంపిణీ చేస్తున్నారు.

మెనూ ధరలు..

పాఠశాలలు	పాతధర	కొత్తధర
ప్రాథమిక (ఒక్కోవిద్యార్థికి)	రూ.5.40	రూ.6.79
ప్రాథమికోన్నత, ఉన్నత	రూ.7.85	రూ.9.69

రాష్ట్ర ప్రభుత్వమే..

గత నెల నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందజేస్తున్న మెనూ ధరలను ప్రభుత్వం పెంచింది. రోజూ నాణ్యతతో కూడిన భోజనం వడ్డించడంతో పాటు పరిశుభ్ర వాతావరణంలో పిల్లలకు భోజనం పెట్టాలని ఆదేశించింది. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 ప్రతి పాదికన నిధులు వెచ్చిస్తున్నాయి. 9, 10 తరగతులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు ఖర్చు చేస్తోంది.



పాఠశాలలకు సరఫరా చేసిన కలర్ స్టాంపింగ్ కోడిగుడ్లు

రోజూ పర్యవేక్షణ కోసమే కమిటీలు...

భోజన పథకాన్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం పర్యవేక్షణకు కమిటీని నియమించింది. రోజూ ఐఎంఎంఎస్ గోరుముద్ద యాప్‌లో విద్యార్థులు హాజరు వేయాలి. గుడ్లు, చిక్కీలు, ఎన్ని ఇస్తున్నారో నమోదు చేయాలి. భోజనం సమయంలో రోజూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విలేజ్ ఆర్గనేజేషన్స్ (వెలుగు) వారంలో మూడుసార్లు విడతల వారీగా ఈ పథకాన్ని పరిశీలించాలి. వారితోపాటు ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓలు కూడా తనిఖీ చేస్తుంటారు. రోజూ మెనూకు సంబంధించిన ఫోటోలను హెచ్‌ఎం లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలి. కాగా ఎమ్మెల్యేలు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న సమయంలో పాఠశాలలకు వెళ్లి ఈ పథకం అమలును తనిఖీ చేస్తున్నారు.

రేపటి నుంచి వీరభద్రస్వామికి విశేష పూజలు

పులివెందుల టౌన్ : ఈనెల 12వ తేదీనుంచి రెండు రోజులపాటు స్థానిక తూర్పు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈనెల 12వ తేదీన ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకం, మహా రుద్రాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించి అనంతరం శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం గ్రామోత్సవం, 13వ తేదీన మహా కుంభ నివేదన (మహా నైవేద్యం) నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

13న మార్కెట్, బస్టాండులకు వేలం పాట

కమలాపురం : స్థానికంగా ఉన్న దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ గదులకు ఈ నెల 13న బహిరంగ వేలం పాట విధించినట్లు నగర కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ రూములకు వేలం పాట దక్కించుకున్న వారు రుసుములు వసూలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మార్కెట్, బస్టాండుకు రూ.50 వేలు, జంతువధ శాల, మార్కెట్ గదులకు రూ.20వేల చొప్పున డీడీలు ఈనెల 12 లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే సాల్వెన్సీ సర్టిఫికెట్లు కూడా అందజేయాలన్నారు. అలాంటి వారే వేలం పాటకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నేడు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో వాసవీమాతకు 102 కలశాలతో పాలాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహకవాచనం, తదితర విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం చండీ హోమం, గుండ ప్రవేశం ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు.

ఆలయ డీఈ గంగయ్యకు సత్కారం



డీఈ గంగయ్యను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల దేవాదాయ శాఖ డీఈగా పనిచేస్తున్న గంగయ్య పదోన్నతిపై విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. శనివారం స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ, దేవాదాయ కమిటీ సభ్యులు పదోన్నతి పొందిన గంగయ్యను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పొట్టిపాటి మాధవాచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు



పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. శనివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దచెప్పలిలో ఆ గ్రామ సర్పంచ్ నామాల శేఖర్, ఎమ్మెల్యే పీఏ కిషోర్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సాయంతో స్మశానంలో, స్మశానంకు వెళ్లే దారితో పాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లన్నీ తొలగించారు. అలాగే పంచాయతీ పరిధిలోని పి.కొత్తపల్లె, ఈడిగపల్లెలో దారుల్లో పేరుకు పోయిన కంపచెట్లను తొలగించారు. ఎన్నో ఏళ్లుగా కంపచెట్లు మొలచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వచ్ఛతతోనే పరిసరాల్లో పరిశుభ్రత



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తదితరులు

వేంపల్లె : స్వచ్ఛతతోనే పరిసరాలలో శుభ్రత ఏర్పడుతుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం చక్రాయపేట మండలం చెరువుకాంపల్లె గ్రామంలో ట్రిపుల్ ఐటీ ఎస్ఎస్ఎస్-3 అధికారి డాక్టర్ జి.విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని సామాజిక, ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, విద్యా వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష ప్రారంభం

కడప స్పోర్ట్స్: నగరంలోని ముగ్గురాళ్ల కృష్ణప్ప మెమోరియల్ గాంధీనగర్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎన్‌సీసీ 'ఏ' సర్టి ఫికెట్ కోర్సు డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రిల్ టెస్టును బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్‌థాపా విచ్చేసి పరిశీలించారు. ఎన్‌సీసీ కేడెట్స్ చేసిన డ్రిల్లు, మ్యాప్‌రీడింగ్ అంశాలను పరిశీలించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పనిచేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం, మతి మరుపు, కుటుంబ కలహాలు, లైంగిక సమస్యలు తదితర సమస్యలకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

చెన్నూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ×పల్లెకు పోదాం× అనే కార్యక్రమం ద్వారా శనివారం మండలంలోని దౌలతాపురం ఎస్టీ కాలనీలోని గిరిజనులకు వివరించామని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి భాస్కర్ తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన విశ్వకర్మ యోజన, 80 కోట్ల మంది భారతీయులకు ఆహార భద్రత, రైతు సంక్షేమానికి భరోసా కింద పీఎం కిసాన్, ఉజ్వల యోజన పథకం ద్వారా 31.54 కోట్ల ఇళ్లకు ఎల్‌పీజీ కనెక్షన్లు, ముస్లిం మహిళలకు ఆత్మగౌరవం భద్రతా హామీ కింద ట్రిపుల్ తలాక్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ప్రజల కోసం పక్కా ఇండ్లు నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ పథకం వంటి వివిధ పథకాలను ప్రజలకు వివరించామన్నారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ కో కన్వీనర్ భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లోమడ శివారెడ్డి, చెన్నూరు కన్వీనర్ బి.వీరప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

కడప కోటిరెడ్డి సర్కిల్ / వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేబీవీఎస్ ది బ్రిజర్వ్ సేవాసమితి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు కరస్పాండెంట్ బి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

తటస్థులు వైఎస్ఆర్‌సీపీలో చేరిక



వైఎస్ కొండారెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ సీపీలో చేరిన ఇసుకచింతలపల్లె, నాగిరెడ్డిపల్లె వాసులు

చక్రాయపేట : మండలంలోని ఇసుకచింతలపల్లె, నాగిరెడ్డిపల్లెలకు చెందిన పలు కుటుంబాల వారు గత కొన్నేండ్లుగా ఏరాజకీయ పార్టీకి సంబంధం లేకుండా తటస్థంగా ఉంటూ వచ్చిన వారు శనివారం చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఇసుకచింతలపల్లెకు చెందిన పెన్నబడి మధుసూదనరెడ్డి, బ్రంహదేవుని ఎర్రంరెడ్డిల ఆధ్వర్యంలో పద్మనాభరెడ్డి, యోగాంజులరెడ్డి, హిమవరకుమార్‌రెడ్డి, రంగారెడ్డి, రమేష్‌రెడ్డి, పాపిరెడ్డి, అమరనాథరెడ్డి, సహదేవరెడ్డి, పురుషోత్తంరెడ్డి, యోగీశ్వర, నాగయ్య, గంగరాజు, వెంకటరమణారెడ్డిలతో పాటు మరిన్ని కుటుంబాలకు చెందిన వారు వైఎస్ఆర్ సీపీలో చేరారు. వారికి కొండారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత వరకు తాము తటస్థంగా ఉంటూ వచ్చామన్నారు.

అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, తోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కొండారెడ్డిలు కార్యకర్తలకు ధైర్యంగా అండగా నిలబడటం చూసి తామంతా పార్టీలో చేరామన్నారు. ఇకనుంచి పార్టీ అభివృద్ధి కోసం నిరతర కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీబాలకృష్ణ, సర్పంచ్ హర్షద్, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి, పార్టీ నేతలు రెడ్డెప్పరెడ్డి, హరినాథరెడ్డి, ఏసోబు, బాబు, చంద్ర, సురేష్‌రెడ్డి, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' కార్యక్రమం

సింహాద్రిపురం : మండలంలోని కోవరగుంటపల్లె గ్రామంలో బీజేపీ నాయకుడు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీజేపీ కార్యకర్తలు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించడంతోపాటు పీఎం మోదీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. అయోధ్యలో రామాలయానికి కృషి చేసిన పీఎం నరేంద్ర మోదీకి మద్దతుగా తీర్మాణాల మీద ప్రజల నుంచి సంతకాలు తీసుకున్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులోని దర్గా వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. అలాగే ఆ వార్డుకు చెందిన ఉత్తయ్య కుమారుడు ఆనారోగ్యంతో బాధపడుతుంటే విషయం తెలుసుకుని ఇంటి వద్దకు వెళ్లి ఆ కుటుంబానికి రూ.15 వేలు నగదును అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, వార్డు ఇన్‌చార్జి యూసోబ్, వార్డు నాయకులు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కార్యకర్తలు వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతో సాధ్యం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందుకు సాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మండల ఎన్నికల ఇన్‌చార్జి మహేంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డితో కలసి మండలంలోని తలపనూరు గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై మీ ఓటును వేసి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడుకు ఓటమి భయం పట్టుకుందని అందుకే పొత్తుల కోసం ఇతర పార్టీల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. కార్యక్రమంలో సర్పంచు శివ మారుతిరెడ్డి, మాజీ సర్పంచులు చెన్నకేశవరెడ్డి, ఉత్తమారెడ్డి, స్థానిక నాయకులు శివప్రసాదురెడ్డి, మునిరెడ్డి, మొరళీమోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, ఈశ్వరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పాడదుర్తిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని వైఎస్సార్, జేసీఎస్ మండల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పాడదుర్తి సచివాలయ పరిధిలోని పాడదుర్తి, వెంకటాపురం గ్రామాలలో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాం

కమలాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పారదర్శకమైన, కచ్చితమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించామని ఈఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాపై ఎన్నికల సన్నద్ధతకు చేపట్టిన చర్యలను వివరిస్తూ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించామని, ఇంకనూ ఏవైన అభ్యంతరాలు ఉంటే ఎప్పటికప్పుడు సవరించడం జరుగుతుందన్నారు. గత ఏడాది డిసెంబర్ 9న కటాఫ్ డేట్‌గా నిర్ణయించి అప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేశామన్నారు.

249 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓటరు జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేశామన్నారు. ఈ జాబితా ప్రకారం 98037 మంది పురుషులు, 102151 మంది మహిళలు, 34 మంది థర్డ్ జెండర్‌లతో కలిపి మొత్తం 2,00,222 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో 230 సర్వీసు ఓటర్లు, 2856 మంది దివ్యాంగుల ఓటర్లు ఉన్నాయన్నారు. ఫైనల్ పబ్లికేషన్ ప్రకారం మొత్తం చేర్పులు 10,146 కాగా, తొలగించిన ఓటర్లు 7508 గా నమోదయ్యా యన్నారు. అలాగే ఈ జాబితా ప్రకారం నియోజకవర్గంలో ఫారం -6(655), ఫారం-7 (991), ఫారం-8 (642) మొత్తం 2288 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తగిన ఆధారాలతో పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో కమలాపురం, చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె, వీ ఎన్‌పల్లె తహసీల్దార్లు సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌బాబు, అమర్నాథ్, చంద్రశేఖర్ వర్మ, భాగ్యలక్ష్మి, ఇ.అమర్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఓ చంద్రమోహన్

రేపు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలను సోమవారం ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు యు.రాజుపాలెంలోని ఆరోగ్య ఉపకేంద్రం, 10 గంటలకు ఇందుకూరులోని రైతు భరోసా కేంద్రం, 11 గంటలకు తలపనూరులోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, 11.30 గంటలకు వెల్దురిలో ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.